క్లుప్తంగా

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



పెనుకొండ: రాజీనామా లేఖలు చూపుతున్న 4వ సచివాలయం వలంటీర్లు

పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని 4వ సచివాలయానికి చెందిన 16 మంది వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. బుధవారం స్థానిక సచివాలయంలో సెక్రటరీని కలసి తమ రాజీనామా పత్రాలను అందజేశారు. రాజీనామా చేసిన వారిలో ఇమ్రాజ్ , బాబా, షామీర్, హసిన్‌తాజ్, ఇంతియాజ్, ఫైజున్నీసా, రేణుకా, షాహీనా, గాయత్రి, నతీఫా, అంజుర్‌భాను తదితరులు ఉన్నారు. ఇక నుంచి తాము ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొంటామని వారు పేర్కొన్నారు.
పెనుకొండ రూరల్: మండలంలోని వెంకటగిరి పాళ్యం గ్రామ సచివాలయానికి చెందిన ఆరుగురు వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు అనుచరుల ఫిర్యాదుతో తమపై ఈసీ ఆంక్షలు విధించినందుకు నిరసనగానే రాజీనామా చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



అదుపులోకి తీసుకున్న జూదరులను చూపుతున్న ఎస్‌ఐ జనార్ధననాయుడు

అమరాపురం: మండలంలోని వి.అగ్రహారం గ్రామ పొలి మేరలో బుధవారం పేకాట స్థావరంపై పోలీసు సిబ్బందితో కలసి దాడి చేసినట్లు ఎస్‌ఐ.జనార్ధననాయుడు తెలిపారు. ఆరుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.31,550 నగదు, ఆరు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మండలంలో ఎవరైనా పేకాట, జూదం, మట్కా తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
రొళ్ల: మండల పరిధిలోని బీజీ హళ్లి గ్రామ సమీపంలో బుధవారం జూద కేంద్రంపై దాడి నిర్వహించినట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. నలుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.4,600 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేశామని, త్వరలోనే మడకశిర కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

పీయూసీ ఫలితాల్లో ప్రతిభ


ప్రభాస్‌యాదవ్

రజిత

పల్లవి

పావగడ: ద్వితీయ పీయూసీ ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ఇందులో భాగంగా పట్టణానికి చెందిన పీఆర్ ప్రభాస్ యాదవ్ సైన్స్ విభాగంలో 600 మార్కులకు గాను 579 మార్కులు సాధించి తాలూకా టాపర్ గా నిలిచాడు. అలాగే ఎస్ రజిత ఆర్ట్స్ విభాగంలో 600 మార్కులకు గాను 503 మార్కులు సాధించి తాలూకా టాపర్‌గా నిలిచింది. అలాగే జీ.పల్లవి కామర్స్ విభాగంలో 600 మార్కులకు గాను 576 మార్కులు సాధించి తాలూకా టాపర్‌గా నిలిచింది.

బాధితుడికి ఆర్థిక సాయం

మడకశిర: నియోజకవర్గంలో ఈనెల 7న ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్‌సీపీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో అగళి మండలం రామనపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బాలకృష్ణ బైక్ అదుపు తప్పి పడిపోవడంతో గాయాలపాలయ్యారు. ప్రస్తుతం బాలకృష్ణ బెంగళూరులో ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో రొళ్ల జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు రూ.50 వేలు, రొళ్ల వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ శివప్రసాద్ రూ.20 వేలు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వైఎన్ రవిశేఖర్ రెడ్డి రూ.10 వేలు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం సభ్యుడు సురేష్‌రెడ్డి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. బాలకృష్ణ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు.

ఎన్నికల విధులపై శిక్షణ



శిక్షణలో పాల్గొన్న పీఓ, ఏపీఓలు

హిందూపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో హిందూపురం నియోజకవర్గంలో పీఓ, ఏపీఓలకు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, తహసీల్దార్ సీహెచ్ శివ ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలు 2024 నిర్వహణలో హిందూపురం మున్సిపాల్టీ, రూరల్, లేపాక్షి, చిలమత్తూరు మండల ఎన్నికల పోలింగ్ మాస్టర్, ట్రైనీలు ఇస్మాయిల్, గణేష్, సురేష్, సునీల్‌చే ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు ఏపీఓలకు శిక్షణ ఇచ్చారు. ఈవీఎంల నిర్వాహణ, ఓటు వేయించే ప్రక్రియ, ఈవీఎంల క్లోజింగ్ తదితర అంశాలపై శిక్షణ అందించారు. కార్యక్రమంలో ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐఓ, ఎన్నికల రెవిన్యూ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేతన్నలు వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలి

● మంత్రి ఉషశ్రీచరణ్



దర్గానగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్



చేనేతలతో సమావేశమైన మంత్రి ఉషశ్రీచరణ్

సోమందేపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో చేనేత రంగాన్ని ఎంతగానో ఆదుకున్నారు. కాబట్టి నేతన్నలందరూ వైఎస్సార్‌సీపీకు అండగా నిలిచి మరోసారి జగనన్నను ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఉంది' అని రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమశాఖా మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషాశ్రీ చరణ్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రమైన సోమందేపల్లిలోని దుర్గానగర్‌లో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ అర్హులైన వారందరికీ నేతన్న నేస్తం పథకం ద్వారా రూ.24 వేలు ఆర్థిక సహాయం అందించిన విషయం గుర్తు చేశారు. కరోనా సమయంలోనూ నేతలన్నలకు పక్కాగా సాయం అందించారన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిత్యం చేనేత కార్మికుల ఆత్మహత్యలు, పరిశ్రమల సంక్షోభంలో కూరుకుపోయిన విషయాన్ని అందరూ గుర్తించాలన్నారు. చేనేతలను ఆదుకోవడమే లక్ష్యంగా సీఎం జగనన్న నేతన్ననేస్తం ప్రవేశ పెట్టిన తర్వాతనే చేతి మగ్గాలకు పూర్వ వైభవం వచ్చిందన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఏకైక సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. చేసిన మంచిని గుర్తించి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు సహరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, జెడ్పీటీసీ సభ్యుడు అశోక్, ఎంపీపీ సభ్యురాలు గంగమ్మ, వైస్ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు నాగభూషణరెడ్డి, సర్పంచ్ గంగాదేవి, వైస్ సర్పంచ్ వేణు, ఎంపీటీసీ సభ్యుడు పూజారి ఈశ్వరయ్య, స్థానిక నాయకులు లక్ష్మిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, అబ్దుల్, ఎల్లారెడ్డి, నరసింహమూర్తి, ఇమామ్‌వలి, చంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

చేనేతలకు అండగా ఉంటాం

చేనేత పరిశ్రమను నమ్ముకుని ఉన్న వారికి తాను అండగా ఉంటానని మంత్రి ఉషశ్రీచరణ్ భరోసా ఇచ్చారు. మండల కేంద్రంలోని చేనేత పరిశ్రమ యాజమానులు డీ.సీ.నారాయణ స్వామి, ఈశ్వరయ్య, రంగనాయకులు, అశ్వర్థ, కుళ్లాయప్ప, మహమ్మద్ ఇళ్లకు వద్దకు వెళ్లి మద్దతు ఇవ్వాలని కోరారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

సోమందేపల్లి మండలలోని పందిపర్తి గ్రామానికి చెంనని టీడీపీ యువజన నాయకులు రాము, బాబు.... మంత్రి ఉషాశ్రీచరణ్ సమక్షంలో గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక నాయకులు గజేంద్ర, రవీంద్ర, నరసింహమూర్తి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయండి



దొమ్మరహట్టిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప



జనసేన కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఈరలక్కప్ప

రొళ్ల: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం మండల పరిధిలోని దొమ్మరహట్టి, టీడీ పల్లి, అగ్రహారం, హొట్టేబెట్ట తదితర గ్రామాల్లో స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజుతో కలిసి పర్యటించారు. ఆయా గ్రామాల్లో పార్టీ ముఖ్య నాయకులతో ఎన్నికల ప్రచారంపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప మాట్లాడుతూ మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయానికి పూర్తి స్థాయిలో పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు యథావిధిగా కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్నికుట్రలు, కుతంత్రాలు చేసిన ప్రజలు ఓటు ద్వారా వారికి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. తొలుత దొమ్మరహట్టిలో వైస్ సర్పంచ్ రవికుమార్ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్పను ఘనంగా సన్మానించారు. గురు, శుక్రవారం రెండురోజుల పాటు హొట్టేబెట్ట, బీజీ హళ్లి, ఎం.రాయాపురం, రొళ్ల, హులికుంట పంచాయతీలో చేపట్టనున్న ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ శ్రేణులు విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు అనంతరాజు, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రంగేగౌడు, బీజీ హళ్లి సర్పంచ్ సదాశివప్ప, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు సంతోష్, వైస్ సర్పంచ్ రవికుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగరాజు, రవికుమార్, ముద్దారెడ్డి, గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

మడకశిర: మండలంలోని పత్తికుంట గ్రామానికి చెందిన పలువురు జనసేన కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వైఎన్ రవిశేఖర్‌రెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప కండువాలు వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవిశేఖర్‌రెడ్డి, నాయకుడు రాధాకృష్ణ ఆధ్వర్యంలో వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేపట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వారు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



అలంకరణలో చౌడేశ్వరీదేవి



చండీహోమం నిర్వహిస్తున్న వేదపండితులు

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం గ్రామంలో చౌడేశ్వరీదేవి ఆలయంలో బుధవారం వైభవంగా చండీహోమం నిర్వహించారు. వేదపండితులు హోమాలు నిర్వహించి గ్రామానికి, ప్రజలకు మంచి జరగాలని పూజలు చేశారు. ఉదయం వేదపారాయణం, కలశార్చన, అగ్నిప్రతిష్టాపన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి చిన్నారులు శ్రీరామ చెక్క భజన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మండలి చైర్మన్ ఎస్ఆర్ఐ కేశవమూర్తితో పాటు గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఆస్తి పన్నుపై 5 శాతం రాయితీ

మడకశిర: మడకశిర మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ఆస్తిపన్ను మొత్తాన్ని ఒకేసారి చెల్లిస్తే 5 శాతం రాయితీ వర్తింపజేస్తున్న మున్సిపల్ కమిషనర్ రంగస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెలాఖరులోగా చెల్లిస్తేనే ఈ రాయితీ పొందవచ్చారు. మున్సిపాలిటీ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేత్రదానం



కృష్ణహెబ్బార్ (ఫైల్)

పావగడ: పట్టణంలోని స్వాగత్ హోటల్ యజమాని సుందర్‌రాజ్ తృతీయ కుమారుడు, ఓ ప్రైవేట్ బ్యాంకులో ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎంఎస్ కృష్ణ హెబ్బార్ (40) గుండెపోటుతో బుధవారం బెంగుళూరులో మృతి చెందాడు. కుటుంబీకులు ఆయన కళ్లను దానం చేసి మరో ఇద్దరికి చూపును ప్రసాదించారు. కృష్ణ హెబ్బార్ మృతి పట్ల ఎమ్మెల్యే వెంకటేష్, మున్సిపల్ కౌన్సిలర్లు రాజేశ్, రవి, జీటి గిరీశ్, నరసింహమూర్తి, నాగరాజనాయక్, నంజుండస్వామి, రిజ్వాన్ సంతాపం తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారం

మడకశిరరూరల్: మండల పరిధిలోని గుడ్డంపల్లి కాలనీ, యూ రంగాపురం గ్రామాల్లో మోటార్లు మరమ్మతు చేసి బోరుల్లోకి అమర్చి తాగునీటిని కొళాయిలకు నీటిని సరఫరా చేశామని సర్పంచ్ రంగనాథ్ తెలిపారు. అలాగే అదనపు పైపులు ఏర్పాటు చేశామన్నారు. ఒకవేళ మళ్లీ బోరుల్లో నీరు అరకొరగా వస్తే ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు

హిందూపురం: సద్గురు యోగి నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో బుధవారం మూడు చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు సేవా సమితి అధ్యక్షుడు రవిశంకర్ తెలిపారు. స్థానిక పరిగిరోడ్డులో విగ్నేశ్వర ట్రేడర్స్, గాంధీ చౌక్ వద్ద చలివేంద్రాన్ని పేటవెంకట రమణస్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు భగీరథ నవీన్ కుమార్ ప్రారంభించారన్నారు. ట్రాన్స్‌కో కార్యాలయ ఆవరణం వద్ద డీఇఈ నాగన్న మరో చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు చెప్పారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

సోమందేపల్లి: మండలంలోని పందిపర్తికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సిద్దారెడ్డి (70) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు చరణ్‌రెడ్డి గ్రామానికి చేరుకొని ఆయన మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఆయన కుమారుడు నాగేంద్రను పరామర్శించారు. కన్వీనర్ వెంకటరత్నం, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గజేంద్ర, వైస్ ఎంపీపీ వెంకట నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తుల అందజేత



దుస్తులు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ రహమత్‌బీ

హిందూపురం: రంజాన్ పండుగ సందర్భంగా 12వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ రహమత్ బీ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు అందజేశారు. అలాగే మోడల్ కాలనీ ఈద్గా మైదానంలో రంజాన్ పండుగ సందర్భంగా దగ్గరుండి శుభ్రం చేయించి సదుపాయలు కల్పించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు పరామర్శ

మడకశిర: మండలంలోని బుడ్డయ్యపాళ్యం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త నరసింహమూర్తి ఇరువర్గాల ఘర్షణలో గాయపడి స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు వెంకటరంగారెడ్డి తదితరులు బుధవారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు.

మాజీ ఏజేడీ కన్నుమూత



హనుమంత రాయప్ప (ఫైల్)

పావగడ: తాలూకాలోని ఎర్రపాళ్య గ్రామానికి చెందిన రాష్ట్ర విద్యాశాఖ మాజీ అసిస్టెంట్ జాయింట్ డైరెక్టర్ వైఎస్ హనుమంతరాయప్ప (62) అనారోగ్యంతో బుధవారం కన్నుమూశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. అయన మృతి పట్ల స్థానిక ఎమ్మెల్యే వెంకటేశ్, మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప తదితరులు సంతాపం ప్రకటించారు.

సరిహద్దులో విస్తృత తనిఖీలు



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

పరిగి: ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పలు ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టుల్లో అధికారులు, పోలీసు యంత్రాంగంతో కలిసి విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ప్రధానంగా కర్ణాటక సరిహద్దు ప్రాంతాల నుంచి ఆంధ్ర ప్రాంతంలోకి ప్రవేశిస్తున్న వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అన్నీ కరెక్టుగానే ఉన్నాయనుకున్న తర్వాతనే వాహనాలను అనుమతిస్తున్నారు. తనిఖీలలో డీటీ లక్ష్మీనరసింహం, వీఆర్వోలు రామకృష్ణ, గంగాధర్, సెబ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఐపీఎస్ అధికారి మృతి



ఇలియాజ్(ఫైల్)

హిందూపురం: మాజీ ఐపీఎస్ అధికారి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ హిందూపురం వాసి ఇలియాజ్ బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల పట్టణ ప్రముఖులు, రాజకీయ నేతలు, మైనార్టీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

ఘనంగా జ్యోతుల ఉత్సవం



అలంకరణలో దొడ్డీరమ్మ

రొళ్ల: మండల పరిధిలోని దొడ్డేరి గ్రామ సమీపంలో వెలసిన పురాతన దొడ్డీరమ్మదేవి అమ్మవారికి బుధవారం ఘనంగా మహిళలు జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. ప్రతి ఏడాది ఉగాది పర్వదినం తర్వాత అమ్మవారికి జ్యోతుల ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. బుధవారం ఉదయాన్నే అమ్మవారిని అభిషేకించారు. దొడ్డేరి, కొత్తపల్లి, పిల్లిగుండ్ల, రంగనపల్లి, వెంకటంపల్లితో పాటు సమీపాన అమ్మవారిని కొలిచే కర్ణాటక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి జ్యోతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఈద్గాలో ప్రత్యేక ఏర్పాట్లు



ముస్లిం పెద్దలతో సమావేశమైన గుడ్డంపల్లి వేణురెడ్డి

హిందూపురం: రంజాన్ పండుగ సందర్భంగా అల్ హిలాల్ ఈద్గా మైదానంలో ముస్లింలు సామూహిక నమాజ్ చేసుకోవడానికి ఏర్పాట్లపై ముత్తవల్లీలు, ముస్లింలతో వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి చర్చించారు. ఈ మేరకు ఈద్గా మైదానంలో బుధవారం వారితో సమావేశమయ్యారు. వేణురెడ్డి మాట్లాడుతూ రంజాన్ సందర్భంగా ఈద్గా మైదానానికి తరలివచ్చే వారికి ఏ ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించామన్నారు. అలాగే తమవంతు సహాయ సహకారాలు కూడా అందిస్తామన్నారు. కార్యక్రమంలో ముతవల్లీ నూరుల్లా, సానే ముతవల్లి హుమయున్, జామియా మసీద్ ముతవల్లీ ఖలీల్, సెక్రటరీ అల్లాబకాష్, సిరాజ్ బాయ్, ముస్తఫా, మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, కౌన్సిలర్ ఆసిఫ్, చాంద్‌బాషా, వైఎస్సార్‌సీపీ పట్టణ క్లస్టర్ కన్వీనర్ షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి ఉషశ్రీచరణ్ పర్యటన

గోరంట్ల: మండల పరిధిలోని వానవోలు, గంగంపల్లి, కమ్మవారిపల్లి గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో గురువారం మంత్రి , వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ పర్యటిస్తారని ఆ పార్టీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప తెలిపారు. ఉదయం 7 గంటలకు వానవోలు గ్రామ పంచాయతీ పరిధిలోని కొలిమిపల్లి గ్రామం నుంచి మంత్రి తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తారన్నారు. అలాగే సాయంత్రం 5 గంటలకు గంగంపల్లి , కమ్మవారిపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో మంత్రి ఉషశ్రీచరణ్ రోడ్ షో నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు వైఎస్సార్‌సీపీ మహిళా కార్యకర్తల సమావేశం

మడకశిర: నియోజకవర్గంలోని ఐదు మండలాల వైఎస్సార్‌సీపీ మహిళా కార్యకర్తల సమావేశాలను మండలాల వారీగా గురువారం ఏర్పాటు చేసినట్లు మడకశిర వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాలకు పార్టీ పరిశీలకులు పోకల అశోక్‌కుమార్, ప్రసాద్‌రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. ఆయా మండలాల్లో నిర్వహించే ఎన్నికల ప్రచారంపైనే ప్రధానంగా చర్చిస్తామన్నారు. మండల కేంద్రాల్లోని పార్టీ కార్యాలయాల్లో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఉదయం 10.30 గంటలకు అమరాపురం, మధ్యాహ్నం 12.30 గంటలకు గుడిబండ, మధ్యాహ్నం 2 గంటలకు రొళ్ల, మధ్యాహ్నం 3.30 గంటలకు అగళి, సాయంత్రం 5 గంటలకు మడకశిర రూరల్, అర్బన్ మహిళా కార్యకర్తల సమావేశాలు మడకశిరలోని పార్టీ కార్యాలయంలో జరుగుతాయన్నారు. సమావేశాలకు ఆయా మండలాల పరిధిలోని వైఎస్సార్‌సీపీ మహిళా కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

రొద్దం: మండల కేంద్రంలోని ఈద్గా వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన నరసింహారెడ్డి అనే యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. కుర్లపల్లికి చెందిన మరో యువకుడు చికిత్స పొందుతున్నట్లు చెప్పారు.

ముగ్గురి బైండోవర్

చిలమత్తూరు: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పాతనేరస్తులు, వివాదాస్పద వ్యక్తులపై పోలీసులు కన్నేశారు. ఈ నేపథ్యంలో అలాంటి వారిని గుర్తించి బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నారు. తాజాగా ముగ్గురిని బైండోవర్ చేసినట్లు తహసీల్దార్ భాగ్యలత పేర్కొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి జాతర



అలంకరణలో ఆంజనేయస్వామి

పరిగి: మండలంలోని మోదా పంచాయతీ పరిధిలో సుప్రసిద్ధ ముక్కడంపల్లి ఆంజనేయస్వామి జాతర మహోత్సవం బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రతి యేటా సంప్రదాయ బద్ధంగా చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా ఆంజనేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో పానకాలు, పెసర పప్పును భక్తులకు పంచిపెట్టారు.

వడదెబ్బతో జాగ్రత్త



● ప్రభుత్వ చిన్నపిల్లల వైద్య నిపుణులు శివకుమార్



హిందూపురం టౌన్: రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. దీంతో వడదెబ్బతో చాలా మంది ఆస్పత్రుల పాలవుతున్నారు. హిందూపురం పట్టణంలో సైతం ఉష్ణోగ్రత 40 డిగ్రీలను తాకుతోంది. ఇప్పటికే పట్టణంలో ఒకరు వడదెబ్బ కారణంగా మృత్యువాత పడ్డారు. ఈ సందర్భంగా వేసవిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి చిన్నపిల్లల వైద్య నిపుణులు శివకుమార్ 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలియజేశారు.

సాక్షి : వడదెబ్బ తగలినట్లు ఎలా గుర్తించాలి ?

వైద్యులు : ఎక్కువగా ఎండలో తిరిగిన వారికి వడదెబ్బ తగులుతుంది. వీరికి జర్వం ఎక్కువగా వచ్చి, కళ్లు తిరగడం, వాంతులు, విరేచనాలు వస్తాయి.

సాక్షి : వడదెబ్బ తగిలిన వారికి ఎలాంటి చికిత్స అందించాలి ?

వైద్యులు : వడదెబ్బ తగిలిన వారిని ఎండ ఉన్న ప్రాంతం నుంచి నీడకు తీసుకువెళ్లాలి. శరీరాన్ని చల్లని నీటితో చల్లబరచాలి. చక్కెర, ఉప్పు కలిపిన నీటిని, లేదా ఓఆర్ఎస్ లాంటివి ఇవ్వాలి.

సాక్షి : వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ?

వైద్యులు : ఎండల్లో పనిచేసే వారికి ఎక్కువగా వడదెబ్బ తగులుతుంది. అలాగే మిట్ట మధ్యాహ్నం ఎక్కువ సేపు బయట తిరిగే వారిపై కూడా ఆ ప్రభావం ఉంటుంది. అత్యవసర సమయం ఉంటేనే తప్ప బయటకు వెళ్లకూడదు. బయటకు వెళ్లే సమయంలో తెల్లటి రంగు గొడుగులు వాడాలి. కాటన్ దుస్తులు ధరించడం మేలు.

సాక్షి : వేసవిలో ఎలాంటి ఆహారం తీసుకోవాలి ?

వైద్యులు : వేసవిలో ఎక్కువగా పళ్ల రసాలు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు, నీరు తీసుకోవాలి. కూల్‌డ్రింక్స్ తాగకూడదు. మసాలా పదార్థాలు ఎక్కువగా తినకూడదు.

సాక్షి: పిల్లలను ఎలా చూసుకోవాలి ?

వైద్యులు : పిల్లలు ఎక్కువగా వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉంటుంది. వేసవిలో ఉదయం 10 గంటలు నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పిల్లలను ఎండలో ఆడుకోవడానికి పంపకూడదు. ఇంట్లో లేదా నీడ ప్రాంతంలోనే వారు ఆడుకునేలా చూసుకోవాలి.